ప్రజాశక్తి
సోమవారం 4 డిసెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బతికేదెలా..?

- వెంకట నగరంలో వ్యర్థ రసాయనాల పైపులైన్
- హేచరీస్ కోసం మత్స్యకారుల జీవితాలు బలి
- సర్వత్రా వ్యతిరేకత

పైపులైన్ వేయనున్న సముద్ర తీర ప్రాంతం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పాయకరావు పేట విలేకరి

'మేమంతా బతికే చోట డెక్కన్ కంపెనీ పైప్‌లైన్ వేశారు. ఇప్పుడక్కడ రొయ్యలు దొరకడంలేదు. మా జీవనోపాధి పోయింది. అక్కడెక్కడో కంపెనీలు పెట్టి, ఇక్కడ పైప్‌లైన్ వేయడమేటి ? వేట తప్ప రెండోపని చేతకాని మేమెలా బతకాలి ? ఎక్కడకు వెళ్లాలి ?' – ఇవీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయతీలోని వెంకటనగరం, రాజానగరం మత్స్యకారుల నుంచి వినిపిస్తున్న పశ్నలు. రంగుల పరిశ్రమ (డెక్కన్ కంపెనీ) వస్తే తమ పిల్లలకు ఉద్యోగాలొస్తాయని చెబితే ఆశపడి, పెద్దలు చెప్పిన మాటకు తలూపి బతుకుదెరువు కోల్పాయామంటున్నారు అక్కడి మత్స్యకారులు.

ఆ ప్రాంతంలో తెలిసో, తెలియకో డెక్కన్ కంపెనీ ఏర్పాటుకు అంగీకరించిన మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. సొంతూరుకు ఆనుకొనివున్న సముద్ర తీరంలో చేపల వేటలేక బతకడానికి వలసలు వెళ్లి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. విద్యార్హతలున్న యువతకు ఉద్యోగాలిస్తామన్న డెక్కన్ కంపెనీ మాట తప్పడంతో వివిధ రకాల పనులు చేసుకొని ఇక్కడి వారంతా బతుకుతున్నారు. ఈ నష్టం చాలదన్నట్లు వ్యర్థాలను విడిచిపెట్టడానికి మరో పైప్‌లైన్ నిర్మాణానికి స్థానికంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాకినాడ సెజ్ సమీపంలో హేచరీస్ యజమానులకు నష్టంలేకుండా ఆ జిల్లాలోని తొండంగి మండలం, పెరుమళ్లపురం ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థ రసాయనాలను రెండు కిలోమీటర్ల దూరంలోని సముద్రంలో విడిచిపెట్టకుండా.. దాదాపు 20 కిలోమీటర్లకుపైగా ఉన్న పాయకరావుపేట మండలం వెంకటనగరం సముద్ర తీరంలో విడిచిపెట్టేందుకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టడంపై ఈ ప్రాంత మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వ్యర్థ రసాయనాలు వదిలిన ప్రదేశం నుంచి సముద్రం నీరు వినియోగిస్తే హేచరీస్ నడపలేమని మిగతా 2లో..

విశాఖ తీరంలో ఈదురు గాలులకు ఊగుతున్న చెట్లు

తీరంలో అలజడి

మిచౌంగ్ ప్రభావంతో ఈదురుగాలులు ◆ ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

నైరుతి బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన మిచౌంగ్ తుపాను ఈ నెల 5 నాటికి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాతావరణ శాఖ అధికారుల అంచనాల ప్రకారం తీవ్ర గాలులు, అతి భారీ వర్షాలతో ఈ నెల 4, 5 తేదీల్లో ఎపిలో పలుచోట్ల ముంచెత్తనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో విశాఖలోనూ పరిస్థితి సాధారణానికి భిన్నంగా మారింది. సముద్రం అలలతో పోటెత్తుతోంది. ఆదివారం రోజంతా తీవ్ర గాలులు వీచాయి. సముద్రపు నీటి రంగు ఎర్రగా మారింది. మరోవైపు వర్ష సూచనతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట ఎక్కడ తడిసిపోతుందోనని భయపడుతున్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

చంద్రబాబును చూసేందుకు భారీగా తరలివచ్చిన టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి – సింహాచలం : సింహాద్రి అప్పన్నను దర్శించుకునేందుకు సతీ సమేతంగా ఆదివారం విచ్చేసిన టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు విశాఖ నగరంలో ఘన స్వాగతం లభించింది. ఎయిర్‌పోర్టు నుంచి సింహాచలం వరకూ పెద్దపెద్ద స్వాగత కటౌట్లు, బ్యానర్లు దర్శనమిచ్చాయి. గోపాలపట్నం ఏరియా పసుపుమయంగా మారింది. ఎయిర్‌పోర్టు నుంచి ఎక్కడ చూసినా టిడిపి కార్యకర్తలే కనిపించారు. బాబుకు ఘన స్వాగతం పలికిన వారిలో సింహాద్రి అప్పన్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు, మాజీ మంత్రులు సిహెచ్.అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు ఉన్నారు. సింహాద్రి అప్పన్నను చంద్రబాబు భార్య భువనేశ్వరితో కలిసి దర్శించుకున్నారు.

117 జిఓను రద్దు చేయాలి : యుటిఎఫ్

వార్త 5లో..

డాక్టరేట్ గ్రహీతకు శుభాభినందనలు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ద్వారా డాక్టర్ తాడంగి రత్నాకర్
'ఎలక్ట్రానిక్ గవర్నన్స్ అండ్ డేటా ప్రొటెక్షన్ : ఏ సోషియో - లీగల్ స్టడీ
విత్ స్పెషల్ రిఫరెన్స్ టు షెడ్యూల్ ట్రైబల్ ఏరియాస్ ఇన్ విజయనగరం డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్'
అనే అంశంపై జరిపిన పరిశోధనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి
చేతుల మీదుగా ఈ డాక్టరేట్‌ను అందుకున్న శుభసందర్భంగా
వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు
భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానం సాధించాలని కోరుతూ...

భార్య : తాడంగి వినీల

మామయ్య : పత్తిక భాస్కరరావు
అత్త : పత్తిక కుమారి

మరదలు: పత్తిక దీపిక

తమ్ముళ్లు : తాడంగి అశోక్ కుమార్, తాడంగి దినేష్ కుమార్

సమైక్య అపార్ట్‌మెంట్, తోకాడ, గాజువాక

మొదటి పేజీ తరువాయి..

బతికేదెలా..?

యజమానులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో వ్యర్థాలు వెంకటనగరంలో విడిచిపెట్టడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే డెక్కన్ కంపెనీ విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలతో సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గింది. కొత్తగా పెరుమళ్లపురం ప్రాంతంలోని పరిశ్రమల వ్యర్థాలు వెంకటనగరం సముద్ర తీరంలో విడిచిపెడితే వెంకటనగరం, రాజానగరం మత్స్యకారులకు రెండు పైప్‌లైన్ల మధ్య వేట సాగక వలసలు పోవాల్సిన దుస్థితి ఎదురుకానుంది.

మత్స్యశాఖ లెక్కల ప్రకారం వెంకటనగరంలో 96 బోట్లు, రాజానగరంలో 58 బోట్లు ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో 4,500 మంది మత్స్యకార జనాభావుంది. వీరిలో 1540 మంది సముద్రంలో వేటాడి బతుకుతున్నారు. వెంకటనగరంలో వ్యర్థ రసాయనాలు విడిచిపెడితే తమ జీవనాధారం పోతుందని మత్స్యకారులు అంటున్నారు. అయితే రసాయనాలు విడిచిపెట్టడానికి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్న వెంకటనగరం పంచాయతీకి ఏ సమాచారమూ లేదు. పంచాయతీ అనుమతి కూడా తీసుకోలేదని సర్పంచ్ వంకా వెంకటరమణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. అటవీశాఖ భూముల్లో ఆ శాఖ అనుమతుల్లేకుండా రహదారి పనులు చేపడుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. దీనికి ముందు బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ సెజ్ పరిసర ప్రాంత ప్రజలు వ్యతిరేకించడంతో నక్కపల్లికి తరలించాలని ఈ ఏడాది సెప్టెంబరు 20న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. హేచరీస్ యజమానులకు నష్టంలేకుండా పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం వెంకటనగరం, కాకినాడ తారు రోడ్డు నుంచి సముద్రతీరం వరకు మట్టిరోడ్డు పనులు ఇటీవల ప్రారంభించారు. మత్స్యకారులు ఐక్యంగా ఆ పనులను అడ్డుకోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు.

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ఓట్లను అక్రమంగా వాలంటీర్ల సాయంతో తొలగించడంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రధాన సూత్రధారి అని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. ఆదివారం విశాఖ విమానాశ్రయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసి పలు వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి ఎన్నికలలో ఓడిపోతాననే భయం పట్టుకుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఎవరైతే పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారో వారిని వాలంటీర్ల సాయంతో గుర్తించి వారి ఓట్లను తొలగిస్తున్నారని తెలిపారు. ఈ దుస్థితి ఒక్క విశాఖలోనే లేదని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఉందని రామ్ తెలిపారు. జిల్లా ఎలక్ట్రోల్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు కూడా ఓట్ల తొలగింపు స్కామ్‌లో భాగస్వాములేనని ఆరోపించారు. ఈ పరిస్థితులలో రాష్ట్రంలో మొత్తం ఓట్లు అన్నింటినీ రద్దుచేసి నూతనంగా ఓటర్ల జాబితాను తయారు చేయాలని కోరారు. ఓట్ల తొలగింపు అక్రమాలకు సంబంధించి తన వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని, వాటిని రాష్ట్రపతికి అందజేస్తానని అన్నారు.

బ్యాండ్‌తో ఆకట్టుకున్న నేవీ కళాకారులు

అలరించిన నేవీ బ్యాండ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ : నేవీ డే ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక సాముద్రిక నావెల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ నేవీ సింఫోనిక్ బ్యాండ్ కన్సర్ట్ ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆయన సతీమణి హిమగౌరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమర్‌నాథ్ దంపతులకు తూర్పు నౌకాదళ అధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఆయన సతీమణి, 'నవ' ఈస్టర్న్ రీజియన్ ప్రెసిడెంట్ సంధ్య పెంధార్కర్ ఘన స్వాగతం పలికారు. కమాండర్ మనోజ్ సభాష్టియన్, లెఫ్టినెంట్ కమాండర్ జె.పద్మనాభన్ నేతత్వంలో సాగిన వాద్య విన్యాసం ప్రేక్షకులను మైమరిపించింది. కళాకారుల వాద్య విన్యాసాలకు ప్రేక్షకులు హర్షధ్వానాలతో అభినందించారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ వాద్య కళాకారులను సత్కరించారు.

చలో ఢిల్లీకి తరలిన కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దళితుల రాజ్యాంగ హక్కులు, సామాజిక ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం సమర్పించేందుకు సోమవారం దేశ రాజధానిలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి విశాఖ నగరం నుంచి కెవిపిఎస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధులను పక్కదారి పట్టించడం దారుణమన్నారు. మోడీ హయాంలో హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎం.సుబ్బన్న, ఎం.సుబ్బారావు, ఎంవి.ప్రసాదరావు, టి.నూకరాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

జిల్లాలో 460 ఆరోగ్య సురక్ష శిబిరాలు

'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్

ప్రజాశక్తి - అనకాపల్లి : జిల్లా వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య సేవలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏ విధంగా జరిగాయి ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి ఇంటికీ వైద్య సేవలు విస్తరించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించింది. జిల్లాలో 460 ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించాం.

ఎంతమంది సేవలు పొందారు ?

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 31 వరకు లక్షా 80 వేలా 969 మందికి వైద్య సేవలు అందించాం. వీరికి కావాల్సిన మందులు ఇచ్చాం. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆసుపత్రులకు పంపించాం.

రెఫరల్ కేసులు ఎన్ని ఉన్నాయి ?

ఈ శిబిరాల ద్వారా 4 వేలా 366 రిఫరల్ కేసులను సంబంధిత ఆసుపత్రులకు పంపాం. ప్రధానంగా గుండె, ఆర్థరైటిస్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. అలాగే 37 వేల మందికి కంటి చికిత్సలు అవసరం కాగా వాటిలో కాటరాక్ట్ శస్త్ర చికిత్సలను 1819 మందికి చేశాం. టీబీ, ఎనీమియా, రక్తపోటు, మధుమేహం వంటి కేసులకు చికిత్సలు చేసి పంపిస్తున్నాం.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రాని వారి పరిస్థితి ఏమిటి ?

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యం అందుకునే పరిస్థితుల్లో లేని వారికి ప్రతి నెలా నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా చికిత్సలు అందించనున్నాం. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

9న ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయు ఇన్‌ఛార్జి విసి సమత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం 'వేవ్స్ 2023'ని ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కె.సమత తెలిపారు. ఆదివారం ఉదయం వర్సిటీ జీఎంఆర్ ఆలుమ్ని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ హాజరవుతారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 5 నుంచి ప్రధాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. ఎయు అలుమ్ని అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్ జీఎం.రావు అధ్యక్షత వహిస్తారన్నారు. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ఎయులోని స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను, ప్రయోగ శాలలను సందర్శిస్తారన్నారు. అనంతరం ప్రత్యేక సావనీర్‌ను వేదికపై ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. దేశ, విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఎయు శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేస్తుందన్నారు. విశిష్ట స్థానాలలో ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఎయుతో అనుసంధానం చేయడం, నేటి తరానికి వారిని పరిచయం చేయడం, పరిశ్రమలతో వర్సిటీని అనుసంధానం చేసే కార్యక్రమాలను పూర్వ విద్యార్థుల సంఘం విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజు, ఎ.మన్మోహన్, సంయుక్త కార్యదర్శి ఆకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కొటక్ స్కూల్ డౌన్‌లో తోపుడు బండ్లు ఉన్న ప్రాంతాన్ని హాకర్ జోన్‌గా ప్రకటించాలని విశాఖ తోపుడు బండ్ల సంఘం గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21వ వార్డు కొటక్ స్కూల్ రైల్వే గెస్ట్ హౌస్ ఫుట్‌పాత్‌పై 23 మంది తోపుడు బండ్ల కార్మికులు చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. జివిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిత్యం వీరిపై దాడులు చేస్తున్నారన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో నగరంలో తోపుడు బండ్లు లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి అధికారులు ప్రయత్నించడం సరికాదని అన్నారు. కార్పొరేటర్ చెప్పారని, ఎమ్మెల్యే చెప్పారని చిన్న వాల్తేరు ప్రాంతంలోని అధికార పార్టీ నాయకులు కొత్తగా తోపుడుబండ్లను పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న తోపుడు బండ్ల కార్మికులు ఈ కొత్త బండ్లు పెట్టడం వల్ల మరింతగా ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. 2014 స్ట్రీట్ వండర్స్ చట్టాన్ని అనుసరించి అధికారులు మెలగాలన్నారు. లేనిపక్షంలో నగరంలోని తోపుడు బండ్ల కార్మికులను కదిలించి జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొటక్ స్కూల్ తోపుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అప్పారావు, కె.రాజు, విశాఖపట్నం తోపుడు బండ్ల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు పాల్గొన్నారు.

నోటీసు
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, టెక్కలి
H.M.O.P No:58/2023
Between :
బగాది చిన్నికృష్ణ, S/o పాల్గుణరావు
రాదావల్లభపురం గ్రామము, పోలవరం పోస్టు,
టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా ..వాది
And :
1.బగాది జయలక్ష్మి,
W/o చిన్నికృష్ణ, D/o ఎండు అప్పలరామయ్య,
ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని, నావల్ క్యాంటీన్,
మల్కాపురం, విశాఖపట్నం.
2.నరేష్, నావల్ క్యాంటీన్, మల్కాపురం, విశాఖపట్నం
... ప్రతివాదులు
పై నెంబరు గల కేసులో పిటిషనర్, మొదటి రెస్పాండెంటు నుంచి విడాకులు కోరుతూ శ్రీసీనియర్ సివిల్ జడ్జి టెక్కలి వారి కోర్టులో పిటిషను దాఖలు చేసియున్నారు. అందులో రెండవ రెస్పాండెంటును కూడా చేర్చియున్నారు. అయితే సదరు పిటిషన్ తేదీ.22.12.2023న రెస్పాండెంటులకు హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. పై ఇరువురూ సదరు తేదీన అనగా తేదీ.22.12.2023న ఉదయం 10:30 నిమిషములకు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారాగాని హాజరై మీ యొక్క వాదనను శ్రీ కోర్టు వారికి తెలియపరచగలరు. లేని యెడల మీ పరోక్షములో మీకు వ్యతిరేకంగా పిటీషనరుకు అనుకూలముగా డిక్రీని జారీ చేయుదురు అని తెలియజేయడమైనది.
తేది.04.12.2023 పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం
విశాఖపట్నం
P.CHANDRA SEKHAR AZAD
ADVOCATE
Naupada R.S.(V), TEKKALI (M)
Srikakulam
Cell:7981816605

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
E.A.35/2023 IN O.S.34/2022
Between:
Alla Nookaraju ... Petitioner/Plaintiff
And:
Shriram Housing Finance Ltd., Registered Office, represented by its Managing Director & three others
... Respondents/Defendants
To
4TH RESPONDENT
Smt.Konatala Jayasri,
W/o Udaya Srinivas, Hindu,
aged about 30 years, residing at
D.No.5-7-63, Laxmidevipeta,
Anakapalle-531 001, Anakapalli District.
నోటీస్
పై నెంబరు E.A.35/2023 గల పిటిషనను ఇందలి పెటిషనర్ పై నెంబరు దావాలో డిపాజిటు చేసిన సొమ్మును చెక్కు ద్వారా ఇప్పించ కోరి దాఖలు చేయగా సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం తే:18-12-2023దీకి వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదిన మీరు గాని మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో ఉదయం గం 10-30 ని॥లకు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలయపరచుకోవలెను లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడం మగునని ఇందు మూలంగా తెలయపరచడమైనది.
లంక జగన్నాధం
లంక పార్వతీశ్వర్
అనకాపల్లి
తే:3-12-2023 అడ్వకేట్లు, అనకాపల్లి

జెండాను ఎగురవేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కానరాని బస్సు షెల్టర్లు

నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -తగరపువలస : పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న భీమునిపట్నానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తగరపువలసలో బస్సు షెల్టర్లు కరువయ్యాయి. విశాఖ నగరానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పట్టణంలో కనీసం బస్సు షెల్టర్ లేకపోవడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. స్థానిక జంక్షన్‌లో బస్సు షెల్టర్ లేకపోవడంతో బస్సుల కోసం ఎండ, వానల్లో నిరీక్షించాల్సి వస్తోంది. స్థానికంగా ఉన్న దుకాణాల నీడన ఇబ్బందులు పడుతూ బస్సు వచ్చే వరకు నిల్చున్న పరిస్థితులు ఏ నాటి నుంచో నెలకొని ఉన్నాయి. విశాఖ నుంచి తగరపువలస 222, పెందుర్తి నుంచి 55 టి, 888 నంబర్ల గల ఆర్టీసీ బస్సులు వస్తూ పోతూ ఉంటాయి. విజయనగరం నుంచి తగరపువలస జంక్షన్ మీదుగా కూర్మన్నపాలెంనకు ఇదే మార్గం గుండా 111 నంబర్‌తో మరికొన్ని బస్సులు తిరుగుతున్నాయి. ఇలా వందలాది ఆర్టీసీ బస్సు సర్వీసులు నిత్యం నడుస్తున్నా బస్సు షెల్టర్ మాత్రం లేదు. ఇక్కడి నుంచి ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో విశాఖకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో లెక్కకు మించి ఇంజినీరింగ్ కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు ఉండడంతో విశాఖ నగరం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఇక్కడకు నిత్యం వస్తూ, వెళ్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న తగరపువలస జంక్షన్‌లో బస్సు షెల్టర్‌ను నిర్మించడంలేదు.

జంక్షన్‌లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టు వద్ద, బ్యాంగిల్ షాప్ వద్ద బస్సుల కోసం నిరీక్షించడం విచారకరమనే చెప్పాలి. కనీసం బస్సు షెల్టర్ ఏర్పాటుచేయని ఆర్టీసీ యాజమాన్యం, జివిఎంసి అధికారులు స్మార్ట్ సిటీగా ఎలా అభివృద్ధి చేస్తారన్నది ప్రశ్నగానే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. తగరపువలస నుంచి భీమిలి వెళ్లే ప్రయాణికులు కూడా షెల్టర్ లేక రోడ్డు పైనే నిరీక్షించాల్సి వస్తోంది.

బస్సు షెల్టర్ లేక పోలీసు అవుట్ పోస్టు వద్ద నిల్చున్న ప్రయాణికులు

సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ప్రభుత్వ విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, సమస్యలపై కార్మికులు పోరాడాలని విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కొమ్మది సాయిరాం కాలనీ కూడలి వద్ద శ్రీకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అవాల లక్ష్మణరావు ఆదివారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బగాది శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత భవన నిర్మాణ సామాగ్రి ధరలను విపరీతంగా పెంచిందన్నారు. భూమి ధరలు, రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నులు పెంచడం వల్ల పనులు లేకుండా పోతున్నాయని వివరించారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు పెనుభారంగా మారాయన్నారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును, కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయన్నారు. కార్మికుల హక్కుల కోసం జరిగే ప్రతి పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్, జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, సంఘం గౌరవాధ్యక్షులు ఎ.నీలయ్య, పి.లక్ష్మణ, కె.రమణ, రాము, ఎం.కంచయ్య, ఎం.సిమ్మయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానికంగా కేటాయించిన 4 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) పరీక్ష నిర్వహించారు. ఎపి బాలికల గురుకుల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 226 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎంహెచ్ స్కూల్‌లో 240 మందికి 225 మంది, జిహెచ్ స్కూల్‌లో 207 మందికి 198 మంది, పిఎన్ఎం స్కూల్‌లో 192 మందికి 181 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తంగా 4 పరీక్షా కేంద్రాల్లో 879 మందికి 830 మంది పరీక్ష రాసినట్లు ఎంఇఒ శివరాణి తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం శ్రీ అయ్యప్ప స్వామి సేవా పీఠం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.మురళీమోహనరావు దంపతులు ఆర్థిక సాయంతోఅన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి టిడిపి కాలనీలో ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ ద్వారా ఉచితంగా కంటి అద్దాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు ప్రెసిడెంట్ మజ్జి మాలినాయుడు, జోజి, చైతన్య, దుర్గారావు, శ్రీధర్, దప్పు సన్యాసిరావు, ధనలక్ష్మి, వరలక్ష్మి, జయశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగేశ్వరరావును కలిసిన ఐఎన్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి -ములగాడ : హిందూస్తాన్ షిప్ యార్డు గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టియుసి) నాయకులు 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి నాయకులను నాగేశ్వరరావు అభినందిస్తూ యూనియన్‌కు తన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, గణేష్, వెంకటరమణ, అప్పలకొండ, కర్రయ్య, సురేష్, నూకరాజు, కృష్ణ, రమణ, అప్పారావు, వెంకటరావు, రాజా పాల్గొన్నారు.

ఆనందపురం మార్కెట్లో ట్రాఫిక్ ఇబ్బందులు

ఆనందపురం పూల మార్కెట్లో నిలిచిన ట్రాఫిక్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్ నిత్య రద్దీతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నివారణ చర్యలు చేపట్టాల్సిన పోలీసులు అటువైపు చూడకపోవడంతో స్థానికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆనందపురం నుంచి బోని వెళ్లే రహదారికి ఇరువైపులా షాపులు ఉన్నాయి. షాపు యజమానులు సరుకు తెచ్చుకునే క్రమంలో పెద్ద వాహనాలను రోడ్లపైనే ఉంచుతున్నారు. రోడ్డను ఆక్రమించి మార్కెట్ ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం కలుగుతుంది. ట్రాఫిక్ స్తంభించి వాహనాలు రోడ్డుపై నిలిచిపోతున్నాయి. రోజూ అనేక వాహన ప్రమాదాలు ఈ రోడ్డుపై జరుగుతున్నా అధికారుల్లో చలనం లేదు. ఇక్కడ రోడ్డను సింగల్ లైన్ చేయడం వల్ల వాహనదారులకు ఈ సమస్య తలెత్తుతోంది. పిల్లలు, పెద్దలు పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. సకాలంలో గమ్యానికి చేరుకోలేక సమయం కూడా వృథా అవుతుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వాహన రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సరైన పరిష్కార మార్గాన్ని చూడాలని, భారీ వాహనాలను రోడ్డుపై నిలిపి ఉంచడాన్ని నిలువరించాలని, అధికారులను, పోలీసులను ప్రయాణికులు కోరుతున్నారు.

నూతన పింఛన్‌ను అందిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

కొత్త పింఛన్ అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి13వ వార్డు పరిధి శివాజీనగర్ -2లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న సిరిపురపు అనుపమకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రూ.10 వేలు పెన్షన్‌ను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు బేత దుర్గారావు, పిల్లి వీర్రాజు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-పద్మనాభం : తుపాను నేపథ్యంలో రైతులు వరి పంట పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని పద్మనాభం మండల వ్యవసాయాధికారి ఎవి.చలం సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేశారు. పంట చేతికొచ్చిన ఈ సమయంలో రైతులు ఆందోళన చెందకుండా నిదానంగా ఆలోచించి పంటను రక్షించుకునే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు తుపాను ప్రకటన ఉన్న నేపథ్యంలో వరి పంటను కోయకుండా ఉంచడం మంచిదని పేర్కొన్నారు. ఇప్పటికే కోతలు కోసిన వారు వెంటనే ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లో దిబ్బలు వేసుకోవాలని సూచించారు. గాలి ఎక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ లైనులు తెగిపడే అవకాశముందని, పొలంలోకి వెళ్లే రైతులు గమనించాలని తెలిపారు. తుపానుకు కోసిన వరి పంట తడిస్తే ఎకరానికి 5 కేజీల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు.

తుపాన్‌తో రైతులు బెంబేలు

పంట చేతికి వచ్చిన సమయానికి తుపానులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రకటనతో పెట్టిన పెట్టుబడి కూడా పోతుందని బెంబేలెత్తుతున్నారు. వరి పంటను పొలంలో ఉంచలేక, ఇంటికి తేలేక సతమతమవుతున్నారు. కొంత మంది రైతులు పంటను ఎలాగైనా చేతికి తెచ్చుకోవాలని అధికంగా కూలీలను ఏర్పాటుచేసుకొని పనులు చేస్తున్నారు. ఎకరానికి రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఖర్చు అయిందని, పంట చేతికొచ్చే సమయంలో వర్షాల వల్ల అంతా నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

ముగిసిన నరెడ్కో ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి -పిఎం.పాలెం : పిఎం.పాలెం వి.కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన నరెడ్కో ప్రాపర్టీ ఎక్స్ పో ఆదివారంతో ముగిసింది.

లక్కీడ్రా తీస్తున్న నరెడ్కో ప్రతినిధులు

ఆదివారం సెలవు కావడంతో పెద్ద ఎత్తున కొనుగోలుదారులు తాకిడి నెలకొంది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ప్రాపర్టీ షో విజయవంతంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రాపర్టీషో నరెడ్కో సంస్థ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసిందని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రాపర్టీ అమ్మకాలు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతగా ఎన్‌టిఆర్ ట్రస్ట్, నరెడ్కో ఆధ్వర్యాన అపోలో హాస్పిటల్ సౌజన్యంతో రక్తదాన శిబిరం, ఆరోగ్య పరీక్షల శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాపర్టీ షోకు వచ్చిన సందర్శకులు రక్తదానం చేశారు. ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరై బంపర్ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు జి చక్రధర్, జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాపారావు, రమేష్, సుబ్బారావు, వైశాఖి డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సాగర్, సుభీభవ హోమ్స్ అధినేత హుస్సేన్, సర్దార్ నెస్ట్ ఎమ్‌డి వెంకన్న చౌదరి, మండవ సతీష్, భూమాత ప్రాపర్టీస్ పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

98 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్ట్రీట్ శ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ 98 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు వి.లక్ష్మణరావు, రాంబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బిఎన్ఆర్ పీపుల్స్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-మాధవధార : కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బిఎన్ఆర్ పీపుల్స్ క్లినిక్‌ను పినాకిల్ ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వైఎల్.నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు గుండె జబ్బులపై డాక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. డాక్టర్ వైఎల్ నర్సింగరావు మాట్లాడుతూ, అందరికీ అందుబాటులో వైద్య సేవలను, రక్త పరీక్షలను బిఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అందజేస్తున్నందుకు అభినందించారు. డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అన్వేష్‌బాబు, డాక్టర్ హారిక, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ విశ్వాంత్ మాట్లాడుతూ, ఎంతో ఉన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టినందుకు అభినందిస్తూ ప్రజలకు విరివిగా తెలియజేసి ఈ సేవలను అందే విధంగా బిఎన్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషిలో తాము కూడా పాల్గొని సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మెటర్నిటీ ఆసుపత్రి ప్రతినిధి బిఎల్.నారాయణ, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు, బిఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ భాగ్యలక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధి ఈశ్వరమ్మ, కృష్ణారావు, బుజ్జి, రామారావు, వెంకట్రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. క్లినిక్ ప్రతిరోజూ సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బిఎన్ఆర్ పీపుల్స్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైఎల్.నర్సింగరావు

ఆళ్ల అప్పారావుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆళ్ల అప్పారావుకు నివాళి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తిలో నివాసముంటున్న ఆళ్ల అప్పారావు మృతిచెందడంతో ఆయన భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు సందర్శించి నివాళు లర్పించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సిఐటియు నాయకులు వెంకటరెడ్డి, అప్పలరాజు, అప్పలనాయుడు భౌతికయానికి నివాళులర్పించారు. పెందుర్తి మండలంలో సిఐటియు ఏర్పాటుకు కృషిచేశారని, కార్మికుల సమస్యలపై పోరాడారని అజశర్మ గుర్తుచేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న సిఎంఆర్ అధినేత వెంకటరమణ తదితరులు

ఆటోనగర్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసి 50 ఏళ్లు అయిన సందర్భంగా బిసి రోడ్డులోని కాకతీయ వ్యాలీలో ఆదివారం విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసవ) ఆధ్వర్యాన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గాజువాక ఆటో నగర్‌లోని అన్ని పరిశ్రమల యజమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 50 సంవత్సరాల నుంచి ఉన్న వివిధ పరిశ్రమ యజమానులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐలా కమిషనర్ జయచంద్ర, ఎన్ఎస్ఐసి కామేశ్వరరావు, అశ్విని, సిఎంఆర్ అధినేత ఎం.వెంకటరమణ, శ్రావణి షిప్పింగ్ అధినేత సాంబశివరావు, వాసవ అధ్యక్షులు పాండురంగ ప్రసాదరావు, సెక్రటరీ రాంప్రసాద్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఎమ్ కప్ బాక్సింగ్‌కు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-సీతమ్మధార : సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి నిర్వహిస్తున్న స్టేట్ సిఎం కప్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పురుషులు, మహిళలు, సబ్ జూనియర్స్, జూనియర్, యూత్ అండ్ ఎలైట్, క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ఆదివారం హెచ్‌బి.కాలనీ శెట్టిబలిజ వీధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాయల వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ తరపున సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు రెండేళ్లుగా అత్యంత వైభవంగా విశాఖ వైఎంసి వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఉమ్మడి 13 జిల్లాల్లో పురుషులు, మహిళల పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19వ తేదీన జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే పోటీలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపిక పోటీల్లో తలపడుతున్న బాక్సింగ్ క్రీడాకారులు

కథ-2022 ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శివారెడ్డి తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : కథా సాహితి 33వ సంకలనమైన 'కథ-2022'ను ఆదివారం పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. నగరానికి చెందిన మిత్రసాహితీ సంస్థ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి కె.శివారెడ్డి హాజరయ్యారు. అనంతరం ప్రముఖ రచయిత గంట్యాడ గౌరునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కె.శివారెడ్డి మాట్లాడుతూ, కవులకు, కథకులకు, రచయితలకు సామాజిక బాధ్యత ఉందన్నారు. కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రభావంతో తనలోని శివారెడ్డి మార్పు చెందారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా కమ్యూనిస్టు మేనిఫెస్టో చదివితే జీవితం ఏంటి, దాని పరిణామం అర్థం అవుతుందన్నారు. ఊహజనిత సాహిత్యం ద్వారానే సృజనాత్మకత బయటపడుతుందని తెలిపారు. జీవితాన్ని ప్రేమించడం కన్న ఏమీ లేదని ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్స్ మాటలను గుర్తు చేశారు. సముద్ర చలనం వలె మానవ జీవితం ఉంటుందని తెలిపారు. కథా సాహితి సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ, ఈ సంపుటిలో సీనియర్ కథకులతో పాటు కొత్తగా కథా రచనకు పూనుకున్న రచయితలు కూడా ఉన్నారన్నారు. సాహితి సంస్థ 1990 నుంచి ఉత్తమ కథలను ఎంపికచేసి సంకలనాలుగా ప్రచురిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 33 కథా సంకలనాల ద్వారా 198 మంది కథా రచయితలు రాసిన 45 కథలను ప్రచురించామని నవీన్ వివరించారు. కథా ప్రక్రియ పట్ల యువతలో అవగాహన కల్పించి నవీనతరం కథలను ప్రోత్సహించేందుకు కథా సాహితి యత్నిస్తోందన్నారు. అమెరికాకు చెందిన తానా సంస్థ సౌజన్యంతో తమ సంస్థ కథ సంపుటాలను వెలువరిస్తోందని తెలిపారు. కథా సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ వచ్చాక కథల్లో సీరియస్ నెస్ తగ్గిందని చెప్పారు. ఆనాడు అచ్చుపత్రికలు అంటే పాఠకులు ఆసక్తి చూపించే వారని, ఆన్‌లైన్‌లోని పాఠకులకు ఆనాటి ఆసక్తి నేడు లేదన్నారు. సాంకేతిక మాధ్యమాల్లో వచ్చిన కథా వస్తువులను మెరుగు పరచాలని తెలిపారు. సామాజిక పరిణామంలో కథల పాత్ర ఎంతో ఉందన్నారు. తాము రాసే కథలో కథనాల్లో రచయితలు ఉన్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆత్మీయ అతిథి లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి మాట్లాడుతూ, కథా సాహితీ ఆవిష్కరణ కార్యక్రమం విశాఖలో జరగడం ఇది రెండోసారి అన్నారు. తనకు కవి శివారెడ్డి ఎంతో ప్రభావం కలిగించారని, తన జర్నలిజంలో అది కనిపిస్తుందని తెలిపారు. కథలు సాహిత్యానికి లీడర్ పత్రికలో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తానా ప్రచురణాల కమిటీ చైర్‌పర్సన్ కన్నెగంటి చంద్ర, రచయిత అనువాదకులు ఎల్ఆర్.స్వామి, అనువాదకులు కల్లూరి శ్యామల, రచయిత కెఎస్ మల్లీశ్వరి, రచయిత చింతకింది శ్రీనివాసరావు, కథ సాహితీ సంపాదకులు పాపినేని శివశంకర్, వేణు మాస్టర్, విమర్శకులు విశాఖ వర్మ, సిపిఐ నాయకులు జెవి సత్యనారాయణమూర్తి, సాహితి వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -గాజువాక : పదవ తరగతి పరీక్షల పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేయాలని గాజువాక ఇండస్ట్రియల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) అధ్యక్షులు పాలవలస భాస్కరరావు తెలిపారు. హరనాథ విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం జిప్సా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వచ్చే మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలలో జిప్సా పరిధి పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. ఈ నెల 9వ తేదీన బిసి రోడ్డులోని టిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులచే సదస్సు నిర్వహించి, విద్యార్థులకు పరీక్షలపై భయం పారద్రోలి, చదువుపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని జిప్సా సభ్యులందరూ వినియోగించుకొని 10వ తరగతి విద్యార్థులందరినీ ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరుపరచాలని కోరారు. ఈ సమావేశంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాసరావు, సలహాదారు ఎం.జగ్గారావు, సభ్యులు మురళి, బాబూరావు, కుమార్, మౌళి, నాయుడు, వాసుదేవరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాలవలస భాస్కరరావు

స్టోరీ టెల్లింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో మియావాకీ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముంబాయికి చెందిన బాలల రచయిత్రి కేటీ బాగ్లి డ్రామా ట్రైజెడ్ స్టోరీ టెల్లింగ్ తో పిల్లల మనసులను ఆకట్టుకున్నారు. 8 నుంచి 13 ఏళ్ల వయసు పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సెషన్‌లో ఆమె కథలకు జీవనం పోశారు. ఈ సెక్షన్‌లో రెండు కథల పుస్తకాలను ప్రదర్శించారు. ఊహ జనిత కథలను చెప్పడం ద్వారా వినోదాన్ని మాత్రమే కాకుండా చిన్న పిల్లల్లో పర్యావరణ అవగాహన కల్పించారు.

నెల్లిముక్కులో వైద్య శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : పిబిఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన భూలోకరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని రెయిన్‌బో పిల్లల ఆసుపత్రి సహకారంతో నెల్లిముక్కు కల్యాణ మండపంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 150మంది పిల్లలు, స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ట్రస్ట్ చైర్మన్ పులి రమణారెడ్డి, ట్రస్టు ప్రతినిధి పులి సురేష్‌రెడ్డి, రెయిన్‌బో డాక్టర్లు పాల్గొన్నారు.

ముస్లిముల ప్రార్థనా మందిరానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 96వ వార్డు పరిధి పులగవానిపాలెం నల్ల క్వారీ ప్రాంతంలో ముస్లిముల ప్రార్థనా మందిర నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముస్లిముల అభ్యున్నతికి వైసిపి సర్కారు ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఈ మసీదు నిర్మాణానికి తన వ్యక్తిగత నిధులు రూ.2 లక్షలు సహాయం చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం ముస్లిం సంప్రదాయానుసారం కార్యక్రమ నిర్వాహకులు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాన్, సాహెబ్, షేక్ కోళ్ల పీరు, షేక్ కరీముల్లా, షేక్ రహిమాన, షేక్ అబ్దుల్లా, షేక్ బృహన్, గొర్ల రామునాయుడు, బంగార్రాజు, మూలినాయుడు, మసీదు పెద్దలు, ఎస్‌కె.సాహుల్, షేక్ షఫీ ఉల్లా, షేక్ గంగాధర్, మదీనా, ఆదాం మహమ్మద్ సుభాని, ఇస్మాయిల్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే అదీప్‌రాజు

117 జిఒను రద్దు చేయాలి : యుటిఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న చిన్న అబ్బాయి

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యావ్యవస్థను నాశనం చేస్తున్న జిఒ117ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా శాఖ ద్వితీయ కౌన్సిల్ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా యూనియన్ గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయి మాట్లాడుతూ జిఒ117తో రాష్ట్రంలో నాలుగువేల పాఠశాలలు మూతపడ్డా యన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, జిపిఎస్‌ను వెనక్కు తీసుకుని, పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులను ఒత్తిళ్లకు గురి చేస్తున్న అధికారులు వైఖరి మార్చుకోవాలని, లేకుంటే యుటిఎఫ్ ఆధ్వర్యాన పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన యూనియన్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెపుతూనే, ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపుల తీరును తీవ్రంగా ఖండించారు. గౌరవాధ్యక్షులు నెల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రవీణ్‌ప్రకాష్ దుందుడుకు చర్యలను ఖండించారు. ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. అధికారుల వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి జోగా రాజేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జిఎస్. ప్రకాష్, పోలిమేర చంద్రరావు, కళింగ సతీష్, శేషుకుమార్, రమేష్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, సుభాషిని దేవి, గంజి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి సాయం అందజేత

సాయం అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-దేవరాపల్లి: ప్రమాదంలో కాలుకోల్పోయిన సబ్బవరం మండలం తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ లక్కవరపు ప్రసాద్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.ఐదు లక్షల సాయం చెక్కును తారువలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలోబూడి ముత్యాలనాయుడు బాధితుడికి అందజేశారు ఈ సందర్భంగా ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు ప్రభుత్వపరంగా అండగా నిలిచి, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందజేసిన సిఎం జగన్‌కు, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు తమ కుటుంబమంతా రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు ఉందో, లేదో చెక్ చేసుకోండి

కశింకోటలో ఓటర్ల జాబితా సవరణను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో ప్రతిఒక్కరూ చెక్ చేసుకోవాలని 81వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి మళ్ల సురేంద్ర సూచించారు. ఆదివారం వార్డు పరిధిలోని పోలింగ్ బూత్‌లను సందర్శించారు. బిఎల్‌ఒలతో మాట్లాడి, ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌పై మాట్లాడారు. ఈ సందర్భంగా 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మారిశెట్టి శంకరరావు, వేగి కృష్ణ, కొణతాల బాల, వేదుళ్ల సూర్యప్రభ, నీలగిరి శీను, నంద్యాల గణేష్, క్రీ నాయుడు, జొన్నాడ సురేష్, ఎస్. భానుచందర్ (అఖి) పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట 48,49 బూత్‌లలో ఓటరు సర్వేలో టిడిపి నేతలు పాల్గొన్నారు. ఓటర్లజాబితాను సమగ్రంగా పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగులు సతీష్, అదారి నర్సింగరావు, తాకాసి కృష్ణ, బిఎల్ఒలు పాల్గొన్నారు.

మండలంలోని అచ్చర్ల గ్రామంలో 13,14లో పోలింగ్ బూత్‌లలో ఓటర్ల జాబితా పరిశీలనలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు, యూనిట్ ఇన్‌ఛార్జి నిమ్మదల గోవింద, నిమ్మదల నాగేశ్వరరావు, తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు యస్. సూరి అప్పలరాజు, తలిపా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పొన్నాడ రాజు యూత్ ఇన్‌ఛార్జి యస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని 5న ధర్నా

జయప్రదానికి ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి- కె. కోటపాడు: కె.కోటపాడును కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ఈనెల5న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. ముత్యాలనాయుడు. మండల రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు పంటల వేయక భూములు ఖాళీగా మిగిలిపోయాయని, అనేక ఎకరాల్లో పంటలు వేసిన సాగునీటి కొరతతో చేతికి పంట రాని పరిస్థితి ఉందన్నారు. ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షాభావంతో అనేక ఎకరాల్లో వరినారు ఎండిపోయిందని, తర్వాత నీటి ఆధారం ఉన్న పొలాల్లో నాటు వేసినా, సరిపడా వర్షాలు కురవకపోవడంతో రైతులు పెట్టుబడులతోపాటు పంటనూ నష్టపోయారన్నారు. నీరు ఆధారం ఉన్నచోట రైతులు అనేక ఇబ్బందులు పడి సాగుచేసిన వరిపైర్లు ఇటీవల కురిసిన అకాల వర్షంతో తడిసి నష్టం వాటిల్లిందన్నారు. ప్రస్తుతం పొలాల్లో మిగిలి ఉన్న పైర్లు కోత దశలో మరోమారు తుఫాన్ హెచ్చరికలతో పొలంలోనే గింజలు రాలి నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అన్ని విధాలా నష్టపోయి, తీవ్ర దుర్భిక్షంతో అల్లాడుతున్న రైతులను ప్రభుత్వపరంగా ఆదుకునే చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు కావలసిన విత్తనాలు ప్రభుత్వం ఇవ్వడంతోపాటు పెట్టుబడిసాయం, పంటల బీమా వర్తింప జేయాలని కోరారు. రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో పెద్దఎత్తున బాధిత రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపిన వంగలి యువకులు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామదేవత బొర్రాలమ్మ ఆలయ మండపం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆర్థిక సహాయం అందజేయడంపై స్థానిక యర్రవాని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ కుటుంబంలోని యువకులు ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు

అలమండ అభివృద్ధికి సహకారం

పోతల లక్ష్మి

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఎం.అలమండ గ్రామ అభివృద్ధి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సహకారం మరువలేనిదని మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్, సర్పంచ్ దాడి జగన్నాధరావు (జగన్), అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ, దాదాపు ఐదు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న అలమండ, తారువ తారు రోడ్డు నిర్మాణం, రూ.1.20కోట్లతో ఇంటింటికీ కుళాయి వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, బూడి సహకారంతో ఇప్పటివరకు గ్రామంలో రూ. 19.61కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించిన బూడి ముత్యాలనాయుడుకు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నేత సోమునాయుడు

ప్రజాశక్తి రాంబిల్లి : నిరుద్యోగుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయని డివైఎఫ్ఐ జిల్లా నాయకుడు కూండ్రపు సోమునాయుడు విమర్శించారు. ఆదివారం మండలంలోని జె.చింతువ పంచాయతీ శివారు గజరెడ్డిపాలెం గ్రామంలో డివైఎఫ్ఐ మండల నాయకుడు. ఎరిపిల్లి రాము అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ప్రయివేటు సంస్థల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలను కల్పిస్తామని జిఒ జారీ చేసినా అమలు కాలేదన్నారు. నిరుద్యోగ యువత చదువుకుని, వ్యయప్రయాసల కోర్సు కోచింగ్ తీసుకుని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాబ్, సెజ్‌ల పరిధిలోని వేలాది మంది ఉద్యోగాలు చేస్తున్నా, వారిలో స్థానికులకు అవకాశాలు లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులే అమలుకు నోచుకోకపోయినా, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టకుంటే వారిని సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశం అనంతరం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.రాము, సిహెచ్.ఇల్లాయుడులతో కూడిన 10 మందితో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.నారాయణరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యుడు జి. దేముడునాయుడు, డివైఎఫ్ఐ గ్రామ కమిటీ సభ్యులు వై.రాజు, పి.గణేష్, సిహెచ్. తేజ, వై.రాజేశ్వరి, వై.దేముడు, సిహెచ్. పరమేష్ పాల్గొన్నారు.

దిలీప్ కుమార్‌కు ఘన సత్కారం

దిలీప్ కుమార్‌ను సత్కరిస్తున్న క్షత్రియ సేవా సమితి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుని సమీపంలో ఆదివారం జరిగిన క్షత్రియ సేవా సమితి వన మహోత్సవాల్లో ఏపి ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తమ సేవలతో రాజకీయాల్లో గుర్తింపు వస్తుందన్నారు. పిల్లల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులంతా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత సివి.రాజు,మాజీ ఎమ్మెల్యే అశోక్ బాబు, సంఘం అధ్యక్షులు సత్యనారాయణరాజు, అనకాపల్లి రాజపుత్ర సమాజ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డివి జగన్నాధరాజు (రాజబాబు), పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి పిఎస్ రాజు, దంతులూరి కల్యాణ్ బాబు, కనుమూరి నానాజీ రాజు పాల్గొన్నారు.

వెంకటరమణకు ఘననివాళి

పరామర్శిస్తున్న అయ్యన్న, ఇతర టిడిపి నేతలు

ప్రజాశక్తి-చోడవరం రూరల్:అడ్డూరు గ్రామంలో నాగిరెడ్డి వెంకటరమణ మూడవ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్‌పిటిసిగా, ఎంపిటిసిగా ప్రజలకు పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడి గుర్తుకు తెచ్చారు. కార్యక్రమంలో అడ్డూర్ సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపిటిసి రమేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన నర్సింగరావు

లోకేష్‌తో నర్సింగరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను అనకాపల్లి మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చందక నర్సింగరావు ఆదివారం ఉప్పాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అలుపెరగకుండా నిరంతరం ప్రజలతో ఉంటూ పార్టీ కోసం బాగా కష్టపడుతున్నారని, యువతకు పార్టీలో మంచి గుర్తింపు ఇస్తున్నారని లోకేష్‌కు విన్నవించారు. అలాగే నియోజకవర్గంలో బిసి సాధికార రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర ఆధ్వర్యంలో యువత పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తోందన్నారు.ఈ సందర్భంగా నర్సింగరావును అభినందించిన లోకేష్, పార్టీ కోసం బాగా కష్టపడాలని సూచించారని నర్సింగరావు తెలిపారు..

తుపాను హెచ్చరికతో అన్నదాతల్లో ఆందోళన

కోతకు సిద్ధంగా వున్న వరి చేను

ప్రజాశక్తి.-కశింకోట : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిపైర్లు కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో తుఫాన్ హెచ్చరికలతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండలం పలు గ్రామాల్లో వరి పంట కోతకు వచ్చింది. అయితే తుఫాన్ ప్రభావంతో ప్రస్తుతం గాలులు వీస్తుండడం, రెండు మూడురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఏమాత్రం చినుకులు రాలినా, ప్రస్తుతం వీస్తున్న గాలుల దెబ్బకు కోతకు వచ్చిన వరిచేను నేల పడిపోతుందని, అలాగైతే ధాన్యం నాణ్యత చెడిపోవడంతోపాటు నష్టం వస్తుందని కలవర పడుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల వరిపంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడడడంతోపాటు, ఎకరానికి రూ.30వేల పైచిలుకు పెట్టుబడులు పెట్టామని, తుఫాన్ ప్రభావంతో వర్షం గాలులు వీస్తే తీవ్ర నష్టం తప్పదని భయాందోళనకు గురవుతున్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట, జగ్గన్నపేట గ్రామాలలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఘనంగా జరిగింది. గౌరీ పరమేశ్వరుల ప్రతిమలను పురవీధులలో ఊరేగించారు.

ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటుచేసిన కోలాటం, నేలవేషాలు, బండ్ల వేషాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తిమ్మరాజుపేట సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి బాపునాయుడు, జగ్గన్నపేట సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి కృష్ణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల హక్కుల సాధనకు ఉద్యమం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి- చోడవరం : గ్రామ పంచాయతీల అధికారం, సర్పంచ్‌ల హక్కుల కోసం ఉద్యమిస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు డి ఏరుకునాయుడు అన్నారు. ఆదివారం చోడవరం లక్ష్మమ్మ కళ్యాణ మండపంలో సర్పంచుల సమావేశంలో మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థలో సర్పంచులకు ఏమాత్రం ప్రాతినిధ్యం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తోందన్నారు. ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం నియోజకవర్గ కన్వీనర్ మరగల అర్జున, బొడ్డేటి రామానాయుడు, చందర్రావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో డిఎవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -సీలేరు: తెలంగాణ కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి డిఎవి స్పోర్ట్స్ మీట్ కబడ్డీ పోటీల్లో సీలేరు డిఎవి పాఠశాల విద్యార్థులు అండర్ 17 విభాగంలో రన్నర్స్‌గా నిలిచారని పాఠశాల హెచ్‌ఎం ఓం నమశ్శివాయ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ ఈ పోటీలకు తమ పాఠశాల నుంచి పదవ తరగతి విద్యార్థులు కె..హేమంత్ ఎస్.కె .ఆషిక్, కె. దీక్షిత్, డి. జీవన్, ఏనిమిదవ తరగతి విద్యార్థి డి. జీవన్స్ 7 తరగతి విద్యార్థి ఎస్.కె .ఖాదర్ భాషా పాల్గొని సత్తా చాటారని తెలిపారు. క్రీడాకారులకు పాల్వంచ డిఎవి పాఠశాల ప్రిన్సిపాల్ రామారావు. మోతుగూడెం ప్రిన్సిపాల్ రఘురాం బహుమతులు అందజేశారు. విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన పిఇటి కమలాకర్‌ను వారు ప్రశంసించారు.

పక్కా ఆధారాలుంటేనే తొలగించండి

ఓటర్ల జాబితా సవరణపై బిఎల్‌ఒలకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచన

బిఎల్‌ఒలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- కె.కోటపాడు: పక్కా ఆధారాలుంటేనే నిబంధనల మేరకు ఓటర్ల జాబితాల్లోని పేర్లు తొలగించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200, 201, 202, 203, 204 పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపుల ప్రక్రియను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిఎల్ఒల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో 18ఏళ్ళ నిండిన యువతీ యువకులను గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితాలో తప్పక నమోదు చేయాలన్నారు. వేరొక చోటుకు నివాసం మార్చిన వారిని గురించి క్షుణ్ణంగా విచారించి, చనిపోయిన వారి విషయంలో పక్కాగా విచారించి, తొలగింపులు చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే పైఅధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. బిఎల్‌ఒలు సమర్థవంతంగా పనిచేసే విధంగా ఉన్నతాధికారులు వారికి దిశానిర్దేశం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి, డిపిఆర్‌సి.డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, తహసీల్దార్ జె. రమేష్‌బాబు, ఉప తహసీల్దార్ డి.రమేష్‌బాబు, ల్యాండ్స్ రీసర్వే డిటి బి.సూరి, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్ ఉన్నారు.

ఆదాయ పన్ను నుంచి మినహాయించాలి

ఎంపీ సత్యవతికి సహకార ఉద్యోగులు, పిఎసిఎస్ అధ్యక్షుల వినతి

ఎంపి సత్యవతికి వినతిపత్రం ఇస్తున్న డిసిసిబి సిఇఒ,

ప్రజాశక్తి -మునగపాక రూరల్: ప్రాథమిక సహకార సంఘాలకు ఆదాయపుపన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్యకార్య నిర్వహణాధికారి డివిఎస్ వర్మ ఆధ్వర్యంలో డిసిసిబి ఉద్యోగుల యూనియన్, పిఎసిఎస్‌ల అధ్యక్షులు ఆదివారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 -18 నుంచి నేటివరకు పిఎసిఎస్‌లు జరిపిన వ్యాపార లావాదేవీలపై ఆదాయపు పన్ను కట్టాలని నోటీసులు జారీచేయడం సహకార సంఘాల మనుగడకే ప్రమాదకరమన్నారు. సన్న, చిన్న కారు రైతులకు వారి వ్యవసాయ అవసరాలు తీర్చుకొను నిమిత్తమై గ్రామస్థాయిలో నెలకొల్ప బడి ఎటువంటి లాభాలు ఆశించక సేవలు అందిస్తున్న సహకార సంఘాలకు ఇలా ఆదాయపన్ను వసూలు చేయడం వల్ల సంఘాల మనుగడకు ప్రమాదకర మన్నారు. సంఘం ద్వారా వచ్చిన లాభాలను సహకార సంఘాల చట్టం, బైలా ప్రకారం జనరల్ బాడీ సమావేశంలో ఎప్పటికప్పుడు పంపకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులకు సేవలందించే సహకార సంఘాల ఉనికిని కాపాడాలని కోరారు.దీనిపై ఎంపి సత్యవతి స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధికారి పి నాగభూషణం, అసోసియేట్ అధ్యక్షులు ఎం స్వామి, జనరల్ సెక్రటరీ ఆర్ శివరామకష్ణ, జిల్లా ట్రెజరర్ ఓఎన్ ఈశ్వరరావు, రాష్ట్ర యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్ వెంకటరావు, నాగులపల్లి, తిమ్మరాజుపేట, దిమిలి సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

నన్నయ్య యూనివర్సిటీ పూర్వ విసి ముత్యాలనాయుడు

ముత్యాలనాయుడును సత్కరిస్తున్న భైరవ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని నన్నయ్య యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు సూచించారు. ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురం మండల వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ అవార్డు గ్రహీత పి ఎస్ టి పట్నాయక్ సారథ్యంలో వేడుకలు నిర్వహించారు. భైరవ ఫౌండేషన్ ప్రతినిధి బషీర్, రాము, పవన్ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి హుమెర ఆధ్వర్యంలో వికలాంగులకు చిన్నతనం నుండి సేవలందిస్తూ, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన జాతీయ అవార్డు గ్రహీత పిఎస్‌టి పట్నాయక్‌ను అభినందించారు. వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న విభిన్న ప్రతిభావంతులను సత్కరించారు.

వికలాంగులకు ఉద్యోగాలు కల్పించాలి

ములగాడ : వికలాంగులకు ప్రకటించిన రిజర్వేషన్‌ను అమలు చేస్తూ వారికి ఉద్యోగాలను ప్రభుత్వాలు కల్పించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి కోరారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని శ్రీవిఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వికలాంగుల విద్యకు, వైద్యానికి, ఉపాధికి ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్, వెంకటరవి, ఎస్.శ్రీనివాసరావు, వై.అనసూయాదేవి, కొండబాబు, కుమారి అంజలి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సంఘ సభ్యుని సతీమణి కృష్ణవేణికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వికలాంగురాలైన బి.వెంకటలక్ష్మిని సన్మానించారు.

అనారోగ్యంతో పిఎసిఎస్ అధ్యక్షుడు మృతి

గండి సన్యాసిరావు (ఫైల్)

ప్రజాశక్తి -అచ్యుతాపురం : కొండకర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు గండి సన్యాసిరావు అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం తన స్వగ్రామమైన బంగారయ్యపాలెం గ్రామంలో మృతి చెందారు. దహనసంస్కారాలు సోమవారం స్వగ్రామంలో జరుగుతాయని బంధువులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, వైసిపి సీనియర్ కార్యకర్తగా సొసైటీ అభివృద్ధికి విశేషసేవలు అందించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. సన్యాసిరావు మృతి పట్ల వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు, సీనియర్ నాయకులు కోన బుజ్జి, చీమలపల్లి గ్రామ సర్పంచ్ సియాద్రి నాగ నూకరాజు బైరాగి జాగారపు అప్పలనాయుడు, పిన్నమరాజు వాసు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి కార్యకర్తలు సహకార సంఘ సభ్యులు సన్యాసిరావు మృతికి సంతాపం తెలిపారు.

ఉమ్మడి మ్యానిఫెస్టోపై ప్రచారం

నాగ జగదీష్ ను సత్కరిస్తున్న శిష్టకరణ సాధికార సమితి సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి శిష్టకరణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అక్కు మహంతి రాజా, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం శిష్ట కరణ సాధికార సమితి కన్వీనర్ జక్కువ.వి. గోపీనాథరావు పట్నాయక్ సారథ్యం లో ఆదివారం పట్టణంలోని శిష్ట కరణం కుటుంబ సభ్యులు బాబు ష్యూటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొని, రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన విజయం ఖాయమని, ఉమ్మడి ప్రభుత్వంలో అమలు చేసే మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. వచ్చేది మన ప్రభుత్వ మేనని, ఏ కష్టం వచ్చినా తాము ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బుద్ధ నాగజగదీష్‌ను సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువాతో చిరుసత్కారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ జిల్లా శిష్ట కరణ సాధికార సమితి కన్వీనర్ బలివాడ సత్యారావు,మనాపురం భాస్కర రావు పి. శ్రీనివాసరావు, సిహెచ్ కవిత, పక్కి రమేష్, బి. మహేంద్రనాద్ పట్నాయక్, బాసూరి ఉమామహేశ్వరరావు, రేగులవలస ప్రభాకర్, ఏలూరి శివ, తెలుగుదేశం సభ్యులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలసలో ఆదివారం టిడిపి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, ప్రజావేదికలో టిడిపి రూపొందించిన తొలి మేనిఫెస్టో వివరాలను ప్రజలకు వివరించారు. మేనిఫెస్టో బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, నాయకులు రఘురాంరెడ్డి, కె.శివ, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

సిమెంట్ బెంచీల వితరణ

సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసిన దాతలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పి .భీమవరం రోడ్డులో కొత్తగా నిర్మించిన భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు, సందర్శకులు కూర్చోవడానికి వీలుగా బంగారుమెట్ట గ్రామానికి చెందిన దేవాంగుల సంఘం ప్రతినిధులు రెండు సిమెంట్ బల్లలను ఆదివారం వితరణగా అందజేశారు. మాజీ సర్పంచ్ తమరాన దాసు, కాళ్ల కోటేశ్వరరావు, ఉజ్జి చల్లారావు, బూడిద అప్పారావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో..

కానరాని మౌలిక సదుపాయాలు

-రహదారి సౌకర్యం లేక లబ్ధిదారుల అవస్థలు - వేయని విద్యుత్ పోల్స్

జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న గృహాలు

జగనన్న కాలనీకి ఇదే మార్గం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కుసర్లపూడి గ్రామంలో జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కానరాలేద. కుసర్లపూడిలో 40 మందికి జగనన్న కాలనీ మంజూరైంది. వీరిలో 20 ఇళ్లు నిర్మాణం పూర్తయింది. 15 మంది శ్లాబ్ వరకూ నిర్మాణం చేపట్టారు. మరో ఐదుగురు పునాది దశ వరకూ నిర్మించారు. కాలనీకి రహదారి నిర్మించక పోవడంతో ఇసుక, రాయి, సిమెంట్, తరలింపునకు అదనంగా రవాణా ఖర్చు అవుతుందని లబ్ధిదారులు వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ మడ్డు అప్పలనాయడు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపికి, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రహదారి వేయుటకు నిధులు లేవని

పనులు నిలిచిన వాటర్ ట్యాంకు

చెప్పడం గమనార్హం. అధికార పార్టీలో ఉండి రహదారికి కల్పిచక పోవడం సిగ్గు చేటని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. జగనన్న కాలనీలో ముందుగా లేఅవుట్ వేసి రహదారి నిర్మించాలి. ఇప్పటికీ రహదారి, పూర్తిస్థాయి కరెంట్ ఫోల్స్ వేయలేదు. విద్యుత్ సౌకర్యం లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. వాటర్ ట్యాంక్‌కు పునాది వేశారు. ఆ స్థలం జిరాయితీ భూమిలో ఉండటంతో ఆ పనిని నిలిపివేసి బంజరు ల్యాండ్‌లోనే ట్యాంక్ నిర్మాణం ప్రారంభించారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

250 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో ఆదివారం కందాల నాగరాజు సారధ్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్ఐ విభూషణరావు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. మెడికవర్ హాస్పటల్ బృందం 250 మందికి బీపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ,కందాల నాగరాజు ఆద్వర్యంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. గ్రామీణా ప్రాంతంలో వైద్యశిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఎస్ఐ విభూషణరావు అభినం దించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు అనిల్ వర్మ, యువకులు ప్రసన్నకుమార్, ఆనంద్, జగదీష్, శ్రీను, సత్యం, గోవింద్, శివ, సింహచలం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

విశాఖలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగుర వేయడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. నక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడేటి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ ప్రెసిడెంట్ నానాజీ, డాక్టర్ రఘు, పార్టీ నాయకులు నీలి అశోక్, మొల్లేటి చిన్ని, గంగిశెట్టి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి :తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నెహ్రూ చౌక్ జంక్షన్‌లో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. నాయుళ్ళవీధి నుండి ప్రదర్శనగా నెహ్రూ చౌక్ చేరుకున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, న్యాయవాది, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐ.ఆర్. గంగాధర్, ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అపారావు పాల్గొన్నారు. అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త బోయిన భానుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు సంబరాలు జరుపుకున్నారు.

అచ్యుతాపురం : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయంపై పిసిసి సభ్యులు కూండ్రపు అప్పారావు, తనకాల అనంతరావు హర్షం వెలిబుచ్చారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో బిజెపి విజయంపై ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజన్న సన్యాసినాయుడు మిఠాయిలు పంపిణీ చేశారు.

చీడికాడలో మాట్లాడుతున్న నాయకులు

చీడికాడ:తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించారని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, రేవంత్ రెడ్డి హయాంలో పార్టీకి పట్టం కట్టి ప్రజలు ఆమోదం తెలిపారని శ్రీనివాస్ తెలిపారు. రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమునిపట్నం : తెలంగాణలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టడంతో ఆదివారం స్థానిక చిన్న బజారు జంక్షన్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ గెలుపు పట్ల హర్షం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కదిరి జగన్నాథం, గాదం మహేష్, పల్లా వెంకటరావు, నిమ్మకాయల పైడిరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జైల్ రోడ్డు జంక్షన్‌లో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఆధ్వర్యంలో దీన్ని చేపట్టారు. కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసి, కాంగ్రెస్ విజయం పట్ల హర్షం వెలుబుచ్చుతూ నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ జోడో యాత్రనే కాంగ్రెస్ విజయానికి కారణమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మూల వెంకటరావు పాల్గొన్నారు.

మురుగు నీటి కాలువను శుభ్రం చేయరూ..

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో మురుగు నీటి కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక జగ్గన్న చావిడి ప్రాంతంలో కొంతవరకే శుభ్రం చేసి చెత్తను విడిచి పెడుతున్నారని రిటైర్డ్ ఉద్యోగి ఏ.త్రినాధ్ తెలిపారు. కాలువలు శుభ్ర పరచక పోవడంతో దుర్గం ధంతో ఎన్నో ఇబ్బందులు పడుతు న్నామని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రపరచక పోవడంతో ప్రజలకు అనారోగ్యం ఏర్పడి ఇక్కట్లకు గురవుతున్నారని ఆయన తెలిపారు. కాలువలోని మురుగు నీటితో దోమలు విపరీతంగా పెరిగి పోయాయని ఆయన వాపోయారు.

నిలిచిన మురుగునీరు

జనసేన నేత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో తిమ్మాపురం మేజర్ పంచాయతీ గోకులపాడు గ్రామ జనసేన సీనియర్ నాయకులు మత్తి కార్తీక్ పుట్టినరోజు ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి ఎప్పుడూ తోడ్పడతానన్నారు. కొత్త రామమందిరానికి సీసీ కెమెరాలు అందజేసినట్టు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ అద్దేపల్లి బాబురావు, జనసేన సీనియర్ నాయకులు శానాపతి బాబురావు మాస్టర్, జన సైనికులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల:ఓటర్ల జాబితా చేర్పులు, సవరణలు, తొలగింపులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఆర్ఓ దయానిధి సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

రావికమతం:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక నమోదును మండల ప్రత్యేక అధికారి బి.రవికిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఈ అవకాశాన్ని అర్హులైన ఓటర్లు ఉపయోగించుకోవాలని కోరారు. అర్హులైన వారికి ఓటు హక్కు ఉండాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణ, తొలగింపులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు ఈ శిబిరంలో తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేశ్వరరావు, డిప్యూటీ తహసిల్దార్ మురళీధర్, వీఆర్వో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు కేంద్రాల వద్ద బిఎల్‌వోలు కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన ఓటర్ నమోదు కార్యక్రమాలను వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సందర్శించారు. 24, 50, 51 వార్డుల్లో కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యాన పర్యటించి ప్రజలకు ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు.

సిహెచ్‌డబ్ల్యుల దీక్షలు తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి-పాడేరు: తమను ఆశ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గత నవంబర్24 నుంచి ఐటీడీఏ ఎదుట సిహెచ్ డబ్ల్యు లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆదివారం తాత్కాలికంగా విరమించారు. తమను ఆశ కార్యకర్తలుగా గుర్తిస్తూ ఆశలతో సమానంగా జీతాలు, యూనిఫామ్, మెడికల్ కిట్, మందులు వంటి సౌకర్యాలు కల్పించాలని. గత పది రోజులుగా ఐటిడిఏ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. వివిధ సంఘాలు సిహెచ్‌డబ్ల్యుల ఆందోళనకు మద్దతునిచ్చాయి. తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారులు కనీసం సమస్య పరిష్కారానికి మార్గం చూపలేదని మండిపడ్డారు. పని చేయించుకునే ముందు ఇచ్చే జీతాల్లో వ్యత్యాసం కనీసం అధికారులకు పట్టడం లేదని అన్నారు.

వర్షాభావంతో ఎండుతున్న చెరుకు

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరకు పంట ఎండుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఈ ఏడాది వర్షాలు ఆశించినంత పడక పోవడంతో ఈ ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట చెరకు పక్వానికి రాకముందే ఎండిపోతుంది. దీంతో, పెట్టుబడి ఎక్కువై నష్ట పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు సుమారు 30వేల రూపాయలు పెట్టుబడి అయిందని, మొక్క దశలోనే ఎండిపోవడంతో బెల్లం తయారు చేసినా రాదని, ఏమి చేయాలో తోచక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని శరభవరం గ్రామానికి చెందిన బొబ్బిలి రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ గ్రామంలో గతంలో సుమారు 500 ఎకరాల్లో చెరకు వేసే వారమని, 40 మంది రైతులకు బెల్లం క్రషర్లు ఉండేవని రైతులు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుండి బెల్లంకు గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో చెరకు సాగు తగ్గించామని, క్రషర్లు కూడా మూత పడ్డాయన్నారు. చెరకు సాగుకు అధికంగా పెట్టుబడులు పెట్టడం, ఆదాయం రాక పోవడంతో రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారు. దీంతో పలువురు సాగుకు వెనుకంజ వేస్తున్నారు.

మాట్లాడుతున్న మోదినాయుడు

'గ్రామ పంచాయతీలు నిర్వీర్యం'

ప్రజాశక్తి-రావికమతం:గ్రామ పంచాయతీలను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని చోడవరం నియోజకవర్గ సర్పంచుల సంఘం కన్వీనర్ గంజి మోదినాయుడు తెలిపారు. స్థానిక లక్ష్మీ కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదినాయుడు మాట్లాడుతూ, సర్పంచ్లకు భారత రాజ్యాంగం ప్రకారం వున్న అధికారాలు, విధులు, నిధులు లేకుండా ప్రభుత్వం చేసిందని విమర్శించారు. రాజారెడ్డి రాజ్యాంగం ప్రకారం సచివాలయం వ్యవస్థ కొత్తగా సృష్టించి సర్పంచ్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 14,15వ ఆర్థిక సంఘం నిధులు సొంత ఖాతాలకు మళ్లించి గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి మెయింటనెన్స్ లేకుండా చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్కు పట్టిన గతే రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి పడుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు ఎరుకునాయుడు, సర్పంచ్లు బొడ్డేట రామునాయుడు, మడగల ఫాల్గుణ, చంద్ర పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల 36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కలెక్టరేట్:రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11,12 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద 36 గంటల పాటు మహాధర్నాలు నిర్వహించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో ఆశా కార్యకర్తల విశాఖ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షురాలు ఎస్.పద్మ అధ్యక్షతన జరిగింది. యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్, ఆశా యూనియన్ కార్యదర్శి మేరీలు మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఆశాలపై వేధింపులు ఆపాలన్నారు. ఫోన్ యాప్ లలో పని చేసేందుకు తగిన శిక్షణ ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కోవిడ్లో మరణించిన ఆశాలకు రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. ఎఎన్ఎంల రిక్రూట్మెంట్లో ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న ఉదయం 10 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా కార్యక్రమం జరుగుతుందని, 12వ తేదీ సాయంత్రం వరకూ జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో ఆశా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్

పేరెంట్స్ కమిటీ చైర్పర్సన్ మృతి

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట జెడ్పీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్పర్సన్ వై.దాసులక్ష్మీ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. కొండపాలెం గ్రామానికి చెందిన లక్ష్మీ పాఠశాల చైర్మన్గా కొనసాగుతున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందింది. ఆమె మృతి పట్ల ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

చదువుతున్న విద్యార్థులు

పుస్తకాలు చదవడంతో విజ్ఞానం

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు పుస్తకాలు చదవడం తో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చునని గ్రంథాలయా ధికారి ఎన్.రాజబాబు సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థుల కోసం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు రోజు దినపత్రికలను చదవాలన్నారు. దీంతో, లోకజ్ఞానం పెరుగుతుందన్నారు.

17న శోభన్బాబు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్: నట భూషణ్ శోభన్ బాబు కాంస్య విగ్రహాన్ని ఈనెల 17న డాబాగార్డెన్స్ ప్రెస్ క్లబ్కు ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు వ్యక్తి స్థలంలో ఏర్పాటు చేయనున్నట్లు, శోభన్ బాబు కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ నిర్వాహకులు ఎస్.ఎన్ రావు తెలిపారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నగరంలోని కంచరపాలెంలో శోభన్ బాబు విగ్రహం ఉందని రెండవ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున డాబా గార్డెన్స్ లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.విగ్రహ ఆవిష్కరణకు అవసరమైన స్థలాన్ని ఇచ్చిన స్థలదాత ఎ.సతీష్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చక్ర మిల్క్ ప్రొడక్ట్, సర్వంతరాం క్రియేషన్ మేనేజర్ ఎం.డి జయ రామాంజనేయులు, దసపల్లా హోటల్ మేనేజర్ బెహరా ప్రసాద్, గంట్ల శ్రీనుబాబు, సినీ నిర్మాత ఎం.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కోటవురట్లలో రైతులతో మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి-కోటవురట్ల:తుఫాను ప్రభావంతో రైతులు ఉత్తమంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో సిద్ధంగా ఉన్న వరి పంటలను పరిశీలించారు. వాతావరణం శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 5న తుఫాను తీరం దాటుతుందని, తీరం దాటే సమయంలో వర్షాలు అధికంగా ఉండవచ్చన్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందజేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజిని పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో మత్స్యకారు గ్రామాలైన బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాలను ఆదివారం ఆర్డీవో జయరాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పెద్దలతో మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో గాలులు వీచే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. తీర ప్రాంతంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం తుఫాన్ కేంద్రాలను పరిశీలించి తుపాను సంబంధిత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.ప్రసాద్రావు, మండల తహసిల్దార్ కే.విజయ్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, విఓఆర్ది సత్యనారాయణ పాల్గొన్నారు.

తీరంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డిఓ

5న బహిరంగసభ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:మండంలోని వడ్డాదిలో ఈనెల 5న జరిగే సామాజిక సాధికార బస్ యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పి.భీమవరం సర్పంచ్ పి.నపోలు రాము నాయుడు కోరారు. ఆదివారం గ్రామ సచివాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న సర్పంచ్

పుష్పగుచ్చం ఇస్తున్న తాతయ్య బాబు

చంద్రబాబును కలిసిన తాతయ్యబాబు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడును చోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బత్తుల తాతయ్యబాబు ఆదివారం విశాఖపట్నం లో స్వాగతం పలికారు. సింహాచలం వరాహ నరసింహస్వామిని దర్శించుకోవడానికి విచ్చేసిన చంద్రబాబును విశాఖపట్నం ఎయిర్పోర్ట్లో మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికినట్లు ఆయన తెలిపారు.

అనకాపల్లి: సింహాద్రి అప్పన్న దర్శనానికి సతీసమేతంగా వచ్చిన తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబును విశాఖ విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు స్వాగతం పలికారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్:పుస్తకాలను చదవడం ద్వారా మనలోని విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు ప్రపంచ చరిత్రను తెలుసుకునేందుకు ఉపకరిస్తుందని సిబిఐ మాజీ జెడీ వి.వి లక్ష్మీనారాయణ అన్నారు. విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పుస్తకాల పఠనం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని,ప్రతిఇంట్లో ఓ చిన్న లైబ్రరీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఇలాంటి ప్రదర్శనను పిల్లలు సందర్శిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పి.ఎ రాజు, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.